

అసత్య ప్రచారాలు చేసే వారిపై నిఘా

కడప అర్బన్ : సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కడప డిఎస్‌పి ఎం.డి షరీఫ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య విద్వేషాలు రగిల్చే విధంగా సోషల్ మీడియా వేదికగా పరస్పర విమర్శలు, రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతూ శాంతి భద్రతలకు భంగం కలిగించేలా పోస్టులు పెట్టే వారిపై సైబర్ సెల్ సోషల్ మీడియా విభాగం నిఘా ఉంచామని తెలిపారు. అవాస్తవ ప్రచారాన్ని ప్రజలు ఎవ్వరూ నమ్మవద్దన్నారు. ఫేక్ న్యూస్ వ్యాప్తి, ఫార్వర్డ్ చేసే వారిపై నిఘా ఉంచామని పేర్కొన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే పోలీస్ అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటారని, వారి దృష్టికి తీసుకువచ్చి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వంతు సామాజిక బాధ్యతగా పోలీస్ శాఖకు సహకరించి సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం

- కడప 'ఉక్కు' వైఎస్ఆర్ కల
- శంకుస్థాపనలు తప్ప ప్రాజెక్టు ముందుకు కదల్లేదు
- ఆదిమూలం శ్రీనివాస్‌యాదవ్‌ను దారుణంగా హత్య చేశారు
- నిందితులు ఎంపీ, ఎమ్మెల్యే ముఖ్య అనుచరులే
- హంతకులు చట్టసభల్లో వెళ్లకూడదనే నేను నిలబడ్డాను
- నమ్మకంగా సేవ చేస్తా
- మూడో రోజు బస్సు యాత్రలో వై.ఎస్. షర్మిల



బస్సుయాత్రలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

ప్రజాశక్తి- సి.కె. దిన్నె/ పెండ్లిమర్రి / వి.ఎన్.పల్లి / కమలాపురం /వల్లూరు/చెన్నూరు

కడప ఉక్కు పరిశ్రమ తన తండ్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి కల అని, ప్రాజెక్టు పూర్తయింటే 25 వేల మందికి ఉద్యోగాలు వచ్చేవని సిఎం జగన్ మోహన్‌రెడ్డి శంకుస్థాపనలకే పరిమితం చేశారని పిసిసి అధ్యక్షులు వై.ఎస్. షర్మిల అన్నారు. ఆదివారం వైఎస్ఆర్ జిల్లా కమలాపురం నియోజక వర్గంలో మూడో రోజు బస్సుయాత్ర సాగింది. నియోజకవర్గంలోని కమలాపురం, పెండ్లి మర్రి, విఎన్.పల్లె, సికెదిన్నె, వల్లూరు, చెన్నూరు మండలాల్లో పర్యటించారు. ముందుగా ఆమె పెండ్లిమర్రిమండలం యాదవపురం గ్రామంలో వారం రోజుల కిందట హత్యకు గురైన ఆదిమూలం శ్రీనివాస్‌యాదవ్ కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని ఆమె హామీ ఇచ్చారు. శ్రీనివాస్‌యాదవ్‌ను అత్యంత దారుణంగా హత్య చేసి కాల్చేశారని పేర్కొన్నారు. నిందితులు ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి ముఖ్య అనుచరులేనన్నారు. కేసులో ఓ ఎస్ఐని సస్పెండ్ చేసి సరి పెట్టుకున్నారని వాపోయారు. హత్యచేసిన వారిని అధికార పార్టీ నాయకులు కాపాడుతున్నారని చెప్పారు. తహశీల్దార్, పోలీసులు కుమ్మక్కయ్యారని విమర్శి ంచారు. భూమి కోసమే అవినాష్‌రెడ్డి అనుచరులు హత్యచేశారని పేర్కొన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలను ఓట్లు వేసి గెలిపించింది హత్యలు చేయడానికేనా, . ఇక్కడే ఇంత అన్యాయం జరుగుతుంటే ఇక రాష్ట్రంలో పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రం అక్రమాలు, దౌర్జన్యాలు, హత్యలు, దోపిడీ లమయంగా మారిందన్నారు. ఇసుక, మైనింగ్ మాఫియా రాజ్యవే ఏలుతోందని విమర్శించారు. ఎక్కడా అభి వృద్ధి జరగలేదన్నారు. . వైఎస్ఆర్ హయంలోని పెండింగ్ ప్రాజెక్టులకు దిక్కులేదని వాపోయారు. 'తెలంగాణాకు వెళ్లానని... ఇక్కడేమీ పని' అని మా మేనమామ రవీంద్రనాథరెడ్డి అంటున్నారని పేర్కొన్నారు. 'అక్కడ ఒక నియంతని గద్దెదించడానికి వెళ్లాను.. దింపాను.. అక్కడ నా పని పూర్తయ్యింది... ఇప్పుడు ఇక్కడ నాకు పని పడింది' అని ఆమె అన్నారు. కడప ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి వారికి మళ్లీ ఓట్లు వేస్తే ఇలాంటి హత్యలే జరుగుతాయని చెప్పారు. వివేకా హత్య జరిగి ఐదేళ్లయినా ఇంతవరకు హంతకులకు శిక్ష పడలేదని వాపోయారు. హత్యచేసిన వాళ్లు యథేచ్ఛగా బయట తిరుగుతున్నారని, అధికారం అడ్డు పెట్టు కుని దర్జాగా తిరుగుతున్నారని, అన్ని ఆధారులున్నా చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అవినాష రెడ్డే హంతకుడని సిబిఐ చెప్పిందని, అలాంటి వ్యక్తికే జగన్ మళ్లీ టికెట్ ఇచ్చారని పేర్కొన్నారు. ఇది హత్యా రాజకీయాలను ప్రోత్స హించినట్లేనని చెప్పారు. వివేకానందరెడ్డి జగన్‌కు స్వయానా బాబాయి అయినా నిందితుడిని దగ్గరుండి మరీ కాపాడుతున్నారని తెలిపారు. నిందితులు చట్టస భల్లోకి వెళ్లకూడదనే తాను ఎంపీగా పోటీ చేస్తున్నానని ఆమె అన్నారు. ఒక వైపు ధర్మం, మరో వైపు డబ్బు ఉందని, ప్రజలు ఎవరిని గెలిపించాలో ఆలోచన చేయాలన్నారు.

షర్మిలను చూస్తే వైఎస్ఆర్ గుర్తుకొస్తారు : సునీత

తన తండ్రి వివేకానందరెడ్డి కోరిక షర్మిలను ఎంపీగా చూడాలని, ఆమెను చేస్తే వైఎస్ఆర్ గుర్తుకొస్తారని వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత అన్నారు. షర్మిలతో కలసి బస్సుయాత్రలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ పక్కా స్కెచ్‌తోనే తన తండ్రిని హత్య చేశారని పేర్కొన్నారు. వివేకా హత్య విషయంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. తన తండ్రిని చంపితే తనకు పర్సనల్ విషయం ఎలా అవుతుందని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాటలూ విడ్డూరంగా ఉన్నాయన్నారు.





శ్రీనివాస్‌యాదవ్ చిత్రపటానికి నివాళులర్పించి, మృతుడి తండ్రిని ఓదారుస్తున్న వై.ఎస్. షర్మిల

ప్రచారాలు.. బుజ్జగింపులు

గెలుపు కోసం అభ్యర్థుల పాట్లు

అసంతృప్తి నాయకులతో మంతనాలు

కలుపుకొని వెళ్లడానికి రాయభారాలు



సార్వత్రిక ఎన్నికల వేడి పతాకస్థాయికి చేరుకుంది. ప్రధాన పార్టీల అభ్యర్థిత్వాలు ఖరారు కావడంతో అభ్యర్థులు ప్రచారాల్లో నిమగ్నమయ్యారు. మండుటెండలను సైతం లెక్క చేయకుండా ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. నామినేషన్ దాఖలు గడువు నాటికి మొదటి విడత ప్రచారాల్ని పూర్తి చేసేయాలనే ఆలోచనలతో ముందుకెళ్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల వాతావరణం ప్రధాన పార్టీల అభ్యర్థులకు నువ్వానేనా అనే రీతిలో క్లిష్టంగా మారిన నేపథ్యం అందరికీ తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల్లో ప్రధాన పార్టీల నేతలకు స్వల్ప మెజా ర్టీలతో గెలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల నేపథ్యం అభ్యర్థుల గుండెల్లో అలజడిని రేపుతోంది. ఇటువంటి పరి స్థితుల్లో అసంతృప్తులను చల్లబరుచుకోవడంపై అభ్యర్థులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాల్లో 13 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్ మినహా వైసిపి, టిడిపి, పార్టీలు అభ్యర్థులను ప్రకటించడం తెలిసిందే. ప్రతిపక్ష టిడిపిలో టికెట్లు దక్కని నాయకుల నుంచి అస తృప్తుల బెడద ఎక్కువగా కనిపిస్తోంది. ఇందులో ప్రధానంగా కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, రాయచోటి, రాజంపేట, తంబళ్లపల్లిలో అసంతృప్త జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. ఇప్పటికే కమలాపురం, మైదుకూరు, పులివెందుల, ప్రొద్దుటూరు నియోజక వర్గాల పరిధిలోని అసంతృప్తులైన సతీష్‌రెడ్డి మొదలుకుని సాయినాథ్‌శర్మ, రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, రాజుపాలెం ఎంపిపి ప్రభాకర్‌రెడ్డి తదితర నేతలు టిడిపిని వీడిపోయారు. మరికొన్ని చోట అసంతృప్తి సెగలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. వైసిపి అసంతృప్తుల విషయానికి వస్తే మదనపల్లి, రాజంపేట సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ నిరాకరించడం మినహా మిగిలిన 11 నియోజకవర్గాల్లో సిట్టింగులకే టికెట్ ఇవ్వడంతో అసంతృప్తుల బెడద తక్కువగా కనిపిస్తోంది. నామి నేషన్ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు అసంతృప్త నేతలను బుజ్జగించే పనుల్లో నిమగ్నమం కావడం గమనార్హం.

ఉదయం నుంచే ప్రచారాల్లో..

సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ అభ్యర్థుల్లో ఆరాటం పెరిగిపోతోంది. రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రతి రోజూ ఉదయం ఏడు గంటల నుంచే అభ్యర్థులు అనుచరగణంతో కలిసి ప్రచారంలో వాలిపోతున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు తిరుగుముఖం పడుతున్నారు. ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను వ్యక్తిగతంగా కలుసుకుని తమకు ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్నారు. మరో వైపు కాంగ్రెస్, వైసిపి, టిడిపి అధినేతలు బస్సు యా త్రల ద్వారా వరుసగా సభలు, సమావేశాలతో హీట్ పెంచుతున్నారు. కడప జిల్లాలో వైఎస్ కుటుంబంలో అనిశ్చితి నెలకొంది. పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల కాంగ్రెస్ తరుపున కడప పార్లమెంట్‌కు పోటీ చేస్తుండడం, పులివెందుల అసెంబ్లీ బరిలో ఆ కుటుంబానికి చెందిన సభ్యులు పోటీ చేసే అవకాశం ఉండడంతో ప్రచారాల జోరు ఉధృతంగా సాగుతోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో కడప వైసిపి ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రచారాల జోరు పెంచేశారు. రోజూ జిల్లావ్యాప్తంగా కలియ దిరుగుతూ ప్రచారం సాగిస్తుండడం గమనార్హం.

ఆత్మీయ సమావేశాలు...బుజ్జగింపులు

టికెట్ దక్కని అసంతృప్త నేతలు ఆత్మీయ సమావేశాల నిర్వహణతో అలజడి పెంచుతున్నారు. కడప, అన్నమయ్య జిల్లాల్లో ప్రతిపక్ష టిడిపి నుంచి అసంతృప్తి జ్వాలలు పెద్దఎత్తున ఎగిసిపడుతున్నాయి. నెల రోజుల కిందట రాయచోటి టిడిపి ఇన్‌ఛార్జి రమేష్‌రెడ్డి మొదలుకుని తాజాగా రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి బత్యాల వరకు పలువురు అసంతృప్తులు కార్యకర్తల సమావేశాలు, భారీ ర్యాలీలను నిర్వహిస్తూ అసంతృప్తి తీవ్రతను ఎగదోస్తున్నారు. కడపలో అసంతృప్త నేతలు లక్ష్మీరెడ్డి, అమీర్‌బాబు వంటి నాయకులు అసమ్మతి రాగం ఆలపిస్తూనే ఉన్నారు. తాజాగా శనివారం రాత్రి రాయచోటి టిడిపి ఇన్‌ఛార్జి రమేష్‌రెడ్డిని రాజంపేట వైసిపి ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాయచోటి అసెంబ్లీ అభ్యర్థి గడికోట శ్రీకాంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలోకి ఆహ్వానించినట్లు వార్తలు వస్తుండడం గమనార్హం. ఇప్పటికే పలువురు టిడిపి ద్వితీయశ్రేణి నాయకులు వైసిపి కండువా కప్పుకున్నారు. మరి కొంతమంది అసంతృ ప్తులు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. కడప, రాయచోటి నియోజక వర్గాల్లోని అసంతృప్తుల సెగ ఎగిసిపడుతోంది. ప్రొద్దుటూరు లాంటి చోట్ల కొనిరెడ్డి లాంటి అసంతృప్త నాయకులను టిడిపి అభ్యర్థి తన వైపు తిప్పుకోగలిగారు. ఇదిలాఉండగా జిల్లా వ్యాప్తంగా టిక్కెట్లు దక్కించుకున్న అభ్యర్థులు పగలు ప్రచారాలు.. రాత్రిపూట బుజ్జగిం పులు, రాయభారాలు, మర్యాద పూర్వక కలయికల పేర్లతో అసంతృ ప్తులను కలుపుకుని పోవడానికి పావులు కదుపుతుండడం గమనార్హం.

ప్రజాస్వామ్యానికి ఎన్నికలే పునాది

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజాస్వామ్యానికి ఎన్నికలే పునాది అని, పౌరుల చైతన్యమే ప్రజాస్వామ్యానికి దక్షిణ అని, ఓటు హక్కును అమ్ముకోకూడదని అఖిల భారత అభ్యుదయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిరెడ్డి హనుమంత రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్‌టియు భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అత్యుత్తమ పాలనా విధానమని, దానిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రజలందరిమీద ఉందని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ చైతన్య వంతులై, ఓటు హక్కును అమ్ముకోకుండా సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ప్రస్తుత ఎన్నికలలో ప్రతీ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని, సామాన్యులకు ఎన్నికలలో పోటీ చేసే అవకాశం లేకుండా పోయిందని చెప్పారు. కావున ప్రజలు ఓటుహక్కు విలువ తెలుసుకుని దానిని సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వాల పాలన ప్రజల అభివృద్ధికి తోడ్పడేదిగా ఉండాలని తెలిపారు. దేశ ,రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీసే విధంగా సంక్షేమ కార్యక్రమాలు విపరీతంగా అమలు చేయడం మంచిది కాదన్నారు. అభ్యుదయ వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు కె.సురేష్ బాబు మాట్లాడుతూ రాజకీయ పార్టీల మేనిఫెస్టోలు మాత్రమే కాదు, అభ్యర్థులు కూడా తమ నియోజకవర్గం అభివృద్ధికి సంబంధించిన మేనిఫెస్టోలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను పక్కాగా అమలు చేయాల్సిన భాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శంకరయ్య, నాయకులు ఎస్.మహబూబ్ బాష మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపుల వల్ల ప్రజాభిప్రాయానికి తూట్లు పొడుస్తున్నారని చెప్పారు. మాయమాటలతో మేనిఫెస్టోల అమలు చేయకుండా మసిపూసి మారేడుకాయ లాగా చేస్తున్నారని విమర్శించారు. ఇటువంటి వారికి ప్రజలే తగిన గుణపాఠం నేర్పాలన్నారు. సమావేశంలో సి.వి.సుధాకర్, పి.హైదర్ వల్లి, కె.గౌరీశంకర్, యం.శ్రీనివాసులు, ఎన్నికల నిఘా వేదిక నాయకులు యస్. హారున్, దేవర శ్రీకృష్ణ, జి.వెంకట స్వామి, కుమారస్వామి, రాజేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హనుమంతరెడ్డి

ఆర్ఆర్‌తో ఎంపీ, ఎమ్మెల్యే మంతనాలు

- 9న వైసిపిలోకి రమేష్‌రెడ్డి?

ప్రజాశక్తి - రాయచోటి

1952లో రాయచోటి నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి రాజకీయాల్లో పెను సంచలన మార్పులకు నాంది పలికింది. 2009 నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఉమ్మడి కడప జిల్లాలో లక్కిరెడ్డిపల్లి నియోజకవర్గం కనుమరుగైంది. దీంతో గడికోట, రెడ్డెప్పగారి కుటుంబాలు రాయచోటికి వలస వచ్చాయి. 2009 ఎన్నికల తర్వాత రాయచోటి టిడిపికి పెద్ద దిక్కుగా ఉన్న సుగవాసి పాలకొండ రాయుడు నెమ్మదిగా రాజకీయాలకు దూరమవుతూ వచ్చారు. ఆయన అనంతరం సుగవాసి బాలసుబ్రమణ్యం రాజకీయ తెరంగేట్రం చేశారు. 2014లో లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే రెడ్డెప్పగారి రమేష్ కుమార్‌రెడ్డి టిడిపి రాయచోటి నియోజకవర్గ బాధ్యతలు తీసుకున్నారు. 2014, 2019 ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. పదేళ్లుగా లక్కిరెడ్డిపల్లి, రాయచోటి టిడిపి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పార్టీ చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. ఈ సారి రాయచోటి టిడిపి టికెట్ మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డికి ఇవ్వడం, ఆర్ఆర్‌కు టికెట్ కేటాయించక పోవడంతో తీవ్ర నిరాశ కు గురయ్యారు. ప్రతి మండలంలో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసి కార్యకర్తల అభిప్రాయాలను సేకరించారు. తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని కొద్ది రోజులుగా సైలెంట్‌గా ఉంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో రమేష్ రెడ్డి పార్టీ మారుతారన్న వార్తలు హల్చల్ చేశాయి. వైఎస్ వర్ధంతి నాడు వైసిపి తీర్థం పుచ్చుకుంటారన్న వార్తలు వెలువడ్డాయి. కానీ రమేష్ రెడ్డి వైసిపిలోకి వెళ్లలేదు. నిశ్శబ్దంగా ఉన్న రమేష్ రెడ్డిని లక్కిరెడ్డి పల్లెలోని ఆయన నివాసంలో శనివారం రాత్రి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మంతనాలు జరిపారు. వైసిపిలోకి రావాలంటూ ఆహ్వానించారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈనెల 9,10లలో రమేష్ కుమార్ రెడ్డి వైసిపిలో చేరుతున్నట్లు సమాచారం.



రమేష్‌కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

కవులు సమాజ శ్రేయస్సును కాంక్షిస్తారు

ప్రజాశక్తి - కడప అర్బన్

కవులు సమాజ శ్రేయస్సును కాంక్షిస్తారని, ఉత్తమ సమాజం ఎలా ఉండాలో సూచిస్తారని, నైతిక విలువలతో కూడిన సమాజం ఆరోగ్యకరమైందని భావిస్తారని వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి అన్నారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మునిరావువీధిలోని సంస్థ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ ముందస్తు వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ కవులు సమాజానికి దిశా నిర్దేశనం చేయగలరని, నిరంతరం సమాజ శ్రేయస్సు కోసమే తపిస్తారని తెలిపారు. సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి మాట్లాడుతూ రాయలసీమ టూరిజం సంస్థ సాంస్కృతిక విభాగం కార్యక్రమాన్ని చేపట్టిందని, సంప్రదాయమైన పండుగలన్నింటినీ మతాలకు అతీతంగా నిర్వహిస్తుందని తెలిపారు. కొండూరు జనార్ధన రాజు మాట్లాడుతూ ఉగాది సంప్రదాయాల్లో ప్రధానమైనది కవి సమ్మేళనమని, తమ సంస్థ కొంతమంది కవులతో చేపట్టామని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, రమణారెడ్డి, కల్లూరు బాల యల్లారెడ్డి, మధుబాబు ఉగాది కవితలను వినిపించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో విజయ్ కుమార్ బాబు, బాబు, శివరాం పాల్గొన్నారు. నిర్వాహకులు కవులను ఘనంగా సత్కరించారు.

ఘనంగా గంగమ్మ జాతర

ప్రజాశక్తి-చెన్నూరు

మండల కేంద్రమైన చెన్నూరు బస్టాండ్ సమీపంలో పీర్ల సావిడి వద్ద ఆదివారం గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన జాతర మహోత్సవానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ దీపాలతో అలంకరించారు అమ్మవార్లను దర్శించుకునేందుకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేశారు. వేసవి కావడంతో ప్రజలకు మజ్జిగ, మంచినీరు కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చెన్నూరు సిఐ పార్థసారథి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వడ్డెరలకు అండగా ఉంటాం : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో ఉన్న వడ్డెరలకు ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉంటామని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస రెడ్డి, కడప టిడిపి అసెంబ్లీ అభ్యర్థి మాధవి రెడ్డి, కడప పార్లమెంట్ అభ్యర్థి భూపేష్ రెడ్డి అన్నారు. ఆదివారం రాజరాజేశ్వరి కళ్యాణ మండపంలో వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జి. రమణయ్య, సీనియర్ నాయకులు గంప వీరయ్య, చంద్రగిరి నారాయణ, నంద్యాల రవికుమార్, రాయచోటి రామకృష్ణ ఆధ్వర్యంలో వడ్డెరుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మూడో డివిజన్ ఇన్‌ఛార్జి, వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు గంప వీరయ్య అధ్యక్షతన 150 కుటుంబాలను టిడిపిలో చేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్వీర్యమైన వడ్డెర కో- ఆపరేటివ్ సొసైటీలను పునరుత్తేజంతో మళ్లీ కళకళలాడేటట్లు చేస్తామన్నారు. ఎస్‌టి జాబితాలో చేర్చడానికి చంద్రబాబు నాయుడుతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. చిన్న కులాలను వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అనగదొక్కిందని పేర్కొన్నారు. దీంతో వారి అభివృద్ధి కుంటుపడిందని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అందరి అభివృద్ధికి పాటుపడుతామని తెలిపారు. సమావేశంలో నగర వడ్డెర సాధికార సమితి అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రకాష్ నగర్ వెంకటరమణ, మృత్యుంజయ కుంట సుబ్బరాయుడు, వెంకట రామకృష్ణ, జానకిరామ్ రామకృష్ణ, బత్తల శ్రీనివాసులు, మహేష్, దేరంగుల రాయుడు, బత్తల శివ, ధనుష్, మనోజ్, భార్గవ్ వడ్డెర కులస్తులు, యువకులు పాల్గొన్నారు.



వడ్డెరల సమావేశంలో టిడిపి నాయకులు

అవస్థల్లో మెడికల్ రెప్‌లు

ప్రజాశక్తి- కడప అర్బన్

రిసొల్యూట్ ఫార్మాసూటికల్స్ యాజమాన్యం తీరుతో ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలోని పలువురు మేనేజర్లు, మెడికల్ రెప్‌లు తీవ్ర అవస్థలు పడుతున్నారని మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ సభ్యులు, రాయలసీమ మేనేజర్ కె. లక్ష్మీనరసింహ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 4 నెలల వేతనాలు, 4 నెలల ఇతర ఖర్చులు వెంటనే ఇవ్వాలని తెలిపారు. కంపెనీలో పనిచేస్తున్న మెడికల్ రెప్‌లకు వేతనాలు నిలిపివేయడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మేనేజర్లు, మెడికల్ రెప్‌లు ఉండగానే వారి స్థానంలో కొత్తవారిని నియమిస్తున్నారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో 14 మందికి పైగా రెప్‌లు, పలువురు మేనేజర్లను ఇష్టం వచ్చినట్లుగా మారుస్తున్నారని పేర్కొన్నారు. మెడికల్ రెప్‌లను, మేనేజర్లను అసమర్థులుగా చిత్రీకరిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై తాము కార్మిక శాఖ అధికారులకు, ఎపి ఎంఎస్‌ఆర్‌యుకు తెలియజేశామని పేర్కొన్నారు. తాము కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను చేస్తున్నా వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు తమకు న్యాయం చేసి ఆదుకోవాలని పేర్కొన్నారు.

ఆరోగ్య సమాచార కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం కరపత్రం, పోస్టర్స్ ను యుటిఎఫ్ కార్యాలయంలో విడుదల చేశారు. కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు వి.రామంజుల రెడ్డి, జెవివి సునీత, సమతా విభాగం సరస్వతి, జె వి వి బాల ఓబన్న, శివరాం, హెల్త్ డిపార్ట్ మెంట్ నరసింహా రెడ్డి, గోవిందు, మధు పాల్గొన్నారు.

శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి- కడప అర్బన్

శిల్పారామంలో సాంస్కృతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం బద్వేలుకు చెందిన చిన్నారులు నృత్య ప్రదర్శన చేశారు. సినీ జానపద గేయాలకు డాన్స్ చేశారు. కార్యక్రమాలను శిల్పారామం ఏవో శివ ప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.

తెలుగు సంవత్సరాది కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- కడప సిటీ

తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ కార్యవర్గ సభ్యులు ఆదివారం ఎర్రముక్కపల్లెలోని శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో తెలుగు సంవత్సరాది క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కళ్యా సుధాకర్ మాట్లాడుతూ తెలుగు సంవత్సరాది కేలండర్ తీసుకురావడం రాష్ట్ర కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. తెలుగు సంవత్సరాది కేలండర్ ఆవిష్కరించడం. మంచి శుభ పరిణామం అన్నారు. తెలుగు సంవత్సరంలో అందరు సిరిసంపదలతో సుఖసంతోషాలతో గడపాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన పల్లా నరసింహారావు, కోశాధికారి టేకూరి సుదర్శన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రమణ్యం, కార్యనిర్వ కార్యదర్శి పల్లా మురళీకృష్ణయ్య, గౌరవాధ్యక్షులు పల్లా బాలచౌడన్న, బొలిశెట్టి వెంకటస్వామి, దొండ్ల వెంకటరమణ, గోవిందు ఎద్దుల కొండయ్య, బొమ్మల వెంకటయ్య, కొరకూటి వెంకటసుబ్బన్న, వెలిగండ్ల వెంకట సుబ్బరాయుడు, బొమ్మిశెట్టి రవిశంకర్, ఉపాధ్యక్షులు చౌడం సూర్యనారాయణ, గంజికుంట తిరుమల దాసు,బొలిశెట్టి వెంకటసుబ్బయ్య, కొరముట్ల సుబ్బరాయుడు, కార్యవర్గ సభ్యులు టేకూరి పుష్పాంగద, కొరకూటి గోవిందు, ముప్పూరి గోపాల్, ముప్పూరి కొండయ్య,రెబ్బ హరిబాబు, కలికిరి వెంకట రమణ, కడప నగర శాఖ కార్యవర్గ సభ్యులు, శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





బస్టాండ్ వద్ద యువకులు ఏర్పాటు చేసిన చలివేంద్రం

ప్రజల దాహం తీర్చడం హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమని దేవస్థానం మాజీ చైర్మన్, టిడిపి నాయకుడు ఎస్‌వి జయచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం గాండ్ల వీధికి చెందిన యువకులు సింగారెడ్డిగారి కృష్ణారెడ్డి, జయమ్మ జ్ఞాపకార్థం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో పాదచారులు, ప్రయాణికుల కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల చాలా ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రజలు, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రైతురాజ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యం

పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్ర, రాష్ట్రాల్లో రైతు రాజ్యం రావాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ప్రధానమైన రాష్ట్రమన్నారు. రైతు బాగుంటేనే అంతా బాగుంటుందన్నారు. కాంగ్రెస్ మొదటి నుండి వ్యవసాయ, సాగునీటి రంగాలకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని విమర్శించారు. తద్వారా రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2 లక్షల వరకు వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తుందన్నారు. రైతుల ఆత్మహత్యల్లో ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో 3వ స్థానంలో ఉందన్నారు. రైతుల కోసం కాంగ్రెస్ పార్టీ 5 గ్యారెంటీలను ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు హస్తం గుర్తుకు ఓటు వేయాలని తులసిరెడ్డి కోరారు. విలేకరుల సమావేశంలో ధ్రువకుమార్ రెడ్డి, రామకృష్ణ, రాజా, నరసింహారెడ్డి, ఉత్తన్న విజయ్, బాలం సుబ్బరాయుడు, బాబు, బద్రి పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

నిర్భయంగా ఓటును వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఖాజీపేట

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు అందరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని, ప్రశాంత ఎన్నికలే లక్ష్యమని మైదుకూరు డిఎస్‌పి వెంకటేశులు, ఖాజీపేట సిఐ రామాంజులు తెలిపారు. మండలం పరిధిలోని దుంపలగట్టు, పత్తూరు, ఖాజీపేట, సుంకేసుల, మిడుతూరు, ఏటూరు ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కాలిపోయిన కొలిమి గుడిసె

అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధం

ప్రజాశక్తి - వేంపల్లె

అగ్ని ప్రమాదానికి గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో దాదాపు రూ.02 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఖాజా ఉసేన్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో ఖాజా ఉసేన్ కొన్నేళ్ళుగా గుడిసె వేసుకొని బతుకుదెరువు కోసం కొలిమి పని చేసుకుంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు గుడిసెకు నిప్పు పెట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఎండ తీవ్రతకు గుడిసె పూర్తిగా కాలిపోయింది. స్థానికులు అగ్ని మాపకం అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపు చేశారు. అప్పటికే గుడిసెలో ఉన్న చెక్క (కలప) సామగ్రి పూర్తిగా కాలిపోయింది. ప్రభుత్వం ఆర్థికసాయం చేసి తన కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితులు కోరారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - ముద్దనూరు

ఆర్‌టిసి బస్సు ఢీకొన్న ఘటనలో 60ఏళ్ల గుర్తు తెలియని వృద్ధుడు గాయపడి, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. మార్చి 31న ముద్దనూరు-పులివెందుల రహదారిలోని నల్లబల్లె గ్రామం వద్ద ఆర్టీసీ బస్సు ఆ వృద్ధుడ్ని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆ వృద్ధుడ్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఆదివారం చికిత్స పొందుతూ మృది చెందాడు. నల్లబల్లె విఆర్‌ఎ సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ముద్దనూరు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.



వేసవి తాపం.. తాటి ముంజలకు భలే గిరాకీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వేసవి కాలంలో గుర్తుకు వచ్చేది తాటి ముంజలు. వేసవి తాపం ఎక్కువగా ఉండడంతో తాటి ముంజలు గిరాకీ పెరిగింది. ఈ నేపథ్యంలో వీటి ధర డజను రూ.100గా వ్యాపారులు విక్రయిస్తున్నారు. సహజ సిద్ధంగా లభించే పండ్లలో తాటి ముంజలుకు వేసవిలో భలే డిమాండ్. తాటి చెట్లు వంక, వాగులు, నది పరివాహక ప్రాంతాల్లో ఎక్కువగా పెరుగుతాయి. ఏడాదికి ఒకసారి ఫలాలను అందిస్తాయి. చుట్టుపక్కల గ్రామాలైనా ఎర్రిపల్లి, అచ్చువల్లి, ఉలిమెల నుంచి తాటికాయలను పట్టణానికి తెచ్చి, వాటి నుంచి ముంజలు తీసి విక్రయిస్తున్నారు. వేసవి కాలంలో ఈ వ్యాపారం బాగానే ఉంటుంది. అందరూ చాలా ఇష్టంగా తింటారు. తాటి ముంజల ధరలు ఏడాదికేడాది పెరుగుతూనే ఉన్నాయి. గతంలో కన్నా ఈ ఏడాది తాటి కాయలు తక్కువగా రావడంతో వాటి ధరలు పెంచామని వ్యాపారులు చెబుతున్నారు. తాటి ముంజలు సగటు మనిషి ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతాయి. శరీరానికి అవసరమైన ఎ, బి, సి విటమిన్లు, అలాగే ఐరన్ జింక్ పొటాషియం వంటివి పుష్కలంగా ఉంటాయి. వీటిలో అధిక మొత్తంలో నీరు ఉండడం వల్ల శరీర బరువు తగ్గించడంలో ఎంతో ఉపయోగపడతాయి. చికెన్ పాక్స్‌తో బాధపడే వారికి దురద నుంచి ఉపశమనం కలుగుతుంది. శరీరాన్ని చల్లబరుస్తుంది. వేసవిలో దొరికే ముఖ్యమైన పండ్లలో తాటి ముంజలు కూడా ఒకటి. ఇవి చూడడానికి జల్లిలా పట్టుకుంటే జారిపోయే మృదువుగా ఉంటాయి. తియ్యగా నోట్లో వేసుకుంటే కరిగిపోయేలా వాటి లోపలి భాగంలో నీరు ఉంటుంది. ఈ పండు శరీరానికి కలిగించే చలువ వల్ల దీన్ని ఐస్ ఆపిల్ అని కూడా పిలుస్తారు. ఎండాకాలం ప్రారంభం కాగానే తాటి ముంజలు మార్కెట్లో దర్శనమిస్తాయి. శరీరాన్ని చల్లబరిచే ఈ తాటి ముంజల్లో ఉండే పోషకాలు ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయి. ఎండా కాలంలో ఎన్ని నీళ్లు తాగినా అది చెమట రూపంలో బయటకు వెళ్లి పోయి డి హైడ్రేషన్ సర్వసాధారణం. ముంజల్లో నీటి శాతం అధికంగా ఉండడం వల్ల అనేక సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. వేసవిలో శరీరానికి కావల్సిన ఖనిజాలు, చక్కెరలను బ్యాలెన్స్ చేస్తాయి. వీటిలో అధిక మొత్తంలో ఉండే విటమిన్ బి, ఐరన్, క్యాల్షియం శరీరానికి అవసరం. కాబట్టి తాటి ముంజలను పొట్టు లేకుండా తింటే ఆరోగ్యానికి మంచిదని డాక్టర్లు చెబుతున్నారు. వేసవిలో మాత్రమే లభించే తాటి ముంజల వల్ల ఉపయోగాలు చాలా ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు.




వేసవి తాపం తీర్చే తాటి ముంజలు, కాయల నుంచి ముంజలు తీస్తున్న వ్యాపారి

చట్టసభల్లో అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించడానికి క్రిష్టియన్ మైనారిటీ వర్గాలకు అవ కాశం కల్పించాలని.. అంగబలం, అర్థబలం తమకూ ఉందని, ఓటరుగానే కాక నాయకులుగా తమను గుర్తించి సీట్లు కేటాయించాలని రిటైర్డ్ సివిల్ ఇంజినీర్, మాజీ సీఎస్ఐ టౌన్ చర్చ్ సెక్రటరీ పిపి జయకుమార్ కాంగ్రెస్ పార్టీని అభ్యర్థించారు. ఆదివారం ప్రొద్దుటూరు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన పాత్రికే యుల సమావేశంలో జయకుమార్ మాట్లాడుతూ క్రిష్టియన్ మైనారిటీల ప్రాతినిధ్యం చట్టసభల్లో పూర్తిగా కరువైందన్నారు. దామాషా ప్రకారం నియోజకవర్గాల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ముస్లింలకు మైనారిటీ కోటాలో సీట్లు కేటాయించినట్లు, క్రిష్టియన్ మైనారిటీలకు కూడా వాటా కేటాయించాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు వీటిని అమలు పరచడంలో వైఫల్యం చెందాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి అధినేత సామాజిక న్యాయమని చెబుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 175 నియోజకవర్గాలలో ఏ ఒక్క ఎమ్మెల్యే అభ్యర్థిగా క్రిష్టియన్ మైనారిటీలకు కేటాయించలేదన్నారు. బడుగు బలహీన వర్గాల పార్టీగా పేరొందిన కాంగ్రెస్ పార్టీలో కూడా ఎపిసిసి రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల క్రిష్టియన్ మైనారిటీలను గుర్తించకపోవడం ఎంతో బాధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రెడ్డి సామాజిక వర్గ నాయకుని కనుసన్నల్లోనే షర్మిలమ్మ బస్సుయాత్ర కొనసాగుతోందని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రొద్దుటూరు నియోజకవర్గ శాసనసభ అభ్యర్థిత్వానికి తాను పోటీ చేయదలుచుకున్నట్లు ఆయన తెలిపారు. తన అభ్యర్థనను షర్మిల పరిశీలించాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ చిన్న వెంకటస్వామి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఎక్కువగా ఉన్నారని, ఈ ప్రాతిపదికన షర్మిల ఆయా స్థానాల్లో సరైన నిర్ణయం తీసుకొని అభ్యర్థిని ప్రకటించాలని కోరారు.



మాట్లాడుతున్న జయకుమార్

టిడిపి నుంచి వైసిపిలో 150 కుటుంబాలు చేరిక



వైసిపిలో చేరిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - చక్రాయపేట

ఎస్‌వి సతీష్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైసిపి మండల ఇన్‌ఛార్జి వైఎస్ కొండారెడ్డి సమక్షంలో ఆదివారం 150 కుటుంబాలు టిడిపి నుండి వైసిపిలో చేరాయి. ఎర్రబొమ్మనపల్లె పంచాయతీ గడ్డంవారిపల్లె గ్రామంలో ఎల్ఎన్ కృష్ణారెడ్డి, జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో గడ్డంవారిపల్లె, దళితవాడ గ్రామాల్లో వైఎస్ కొండారెడ్డి, జడ్పిటిసి శివ ప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ బెల్లం ప్రవీణ్‌కుమార్ రెడ్డి, జెసిఎస్ లోమడ రామాంజనేయరెడ్డి, ఎంపీపీ మాధవి బాలకృష్ణ, ఎంపీటీసీ గంగిరెడ్డి, సర్పంచ్ లక్ష్మయ్య ఇంటింటి ప్రచారం చేశారు. ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డి మండలంలోని కల్లూరుపల్లి పంచాయితీ హరి నాయుడు, కే రాజుపల్లె జగన్మోహన్ రెడ్డి, కుప్పం మాజీ టిడిపి మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, అద్దాలమరి వేముల శ్రీనివాసులు, వేముల సుధాకర, సిద్ధారెడ్డిగారిపల్లె మాజీ సింగల్ విండో అధ్యక్షుడు భయ్యారెడ్డి, కొండప్పగారిపల్లె నీలం తులసిరెడ్డి, గడ్డంవారిపల్లె భాస్కర్‌రెడ్డి, బాల తిమ్మయ్యగారిపల్లె ఓబుల్‌శెట్టి బాలకృష్ణ, రాంబాబు, తొట్టికాడపల్లి రాజారెడ్డితోపాటు 150 కుటుంబాలను వైసిపిలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు శేషారెడ్డి, మండలంలోని ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మారెళ్లమ్మ తల్లిని దర్శించుకున్న సతీష్‌రెడ్డి

మండలంలోని మారెళ్లమడక గ్రామంలో ఆదివారం మారెళ్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి పలు పూజలు, హోమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎస్‌వి సతీష్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి, మారెళ్లమ్మ తల్లిని దర్శించుకున్నారు.



పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న పుట్టా సుధాకర్ యాదవ్

టిడిపిలోకి వంద కుటుంబాలు..


ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని దిగువ నేలటూరు, గోపిరెడ్డిపల్లె, ఎగువ నేలటూరు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు మన్నెం నాగేశ్వర్‌రెడ్డి, మన్నెం రవిశంకర్ రెడ్డి, మల్లిఖార్జునరెడ్డి వారి అనుచర వర్గం దాదాపు 100 కుటుంబాలు టిడిపిలో చేరాయి. మైదుకూరు నియోజవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా పుట్టా సుధాకర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం ఇస్తానని తెలిపారు. మన్యం రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పని జరగాలంటే లంచాలు ఇవ్వాల్సిందే అన్నారు. రఘురామిరెడ్డి తెలుగుదేశం పార్టీ నుండి వైసిపిలో చేరిన నాయకులకు మాత్రమే న్యాయం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, జనసేన ఇన్‌ఛార్జి పందిటి మల్హోత్రా, బిజెపి ఇన్‌ఛార్జి ఎం.సుబ్బరాయుడు, ముడుమాల పోలిరెడ్డి, రవీంద్రారెడ్డి, మాలేపాటి సుబ్బారావు, ఎల్లటూరు సాంబ శివారెడ్డి, చిలమల నారాయణ, ఆర్. శ్రీనివాసులు, నేట్లపల్లి మల్లికార్జున, కటారి కృష్ణ, తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ప్రొద్దుటూరు రూరల్ పరిధిలోని వివేకానంద కాలనీలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి సమక్షంలో వైసిపి నాయకుడు సుమంత్‌పాటు 100 కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ వివేకానంద కాలనీ అభివృద్ధి చేశామన్నారు. మే 13న ఓటు అనే ఆయుధంతో అత్యధిక మెజారిటీ తెప్పించాలన్నారు. సుమంత్ మాట్లాడుతూ అన్ని విషయాల్లో పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. వరదరాజులరెడ్డి మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. ఎంపీగా చదిపిరాళ్ళ భూపేష్‌రెడ్డి, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని వరద కోరారు. కార్యక్రమంలో యువ నాయకుడు కొండారెడ్డి, టిడిపి నాయకుడు ముక్తియార్, 5వ వార్డు కౌన్సిలర్ మురళీధర్ రెడ్డి, బిసి నాయకుడు చల్లా రాజ గోపాల్ యాదవ్, ఇవి సుధాకర్ రెడ్డి, చౌటపల్లి లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వరదరాజులరెడ్డి



ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మేరీ

యానాది కాలనీలో 'రాచమల్లు' ప్రచారం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గోపవరం పంచాయతీ పరిధిలోని యానాది కాలనీ (ఉప్పాగు)లో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోకుల మేరీ, వైసిపి నాయకులు గోకుల సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి, కుమారుడు రాచమల్లు రాఘవేంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రతి గడపకు వెళ్లి వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, వాటి లబ్ధి గురించి ప్రజలకు వివరించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైసిపిని అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో మాజీ సర్పంచ్ దేవి ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ మోషే, వైసిపి నాయకులు కొండయ్య, ఓబయ్య, భూసం రవీంద్రనాథ్, స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

పులివెందుల రూరల్ : విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల ఆదివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నీటి సరఫరా ఉండదని పురపాలక కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. పులివెందులలో బైపాస్ రోడ్డు విస్తరణకు సంబంధించి కరెంటు లైన్ షిఫ్టింగ్ పనులు జరుగుతున్నందున, నక్కలపల్లి వాటర్ లైన్ రిపేర్ వల్ల నీటి సరఫరాలో అంతరాయం జరుగుతుందన్నారు. ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కమిషనర్ ఒక ప్రకటనలో కోరారు.

నిత్యావసర సరుకులు వితరణ


పులివెందుల రూరల్ : స్థానిక ముత్యాలవారి వీధిలో అరిగెల తిరుపతయ్య వర్ధంతిని పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యులు అరిగెల భరత్, లహరి ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు వితరణ చేశారు. ఆదివారం పట్టణంలోని పుల్లారెడ్డి ఆసుపత్రి సమీపంలోని విభిన్నప్రతిభావంతుల కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన సంస్మరణ కార్యక్రమంలో వారు తిరుపతయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. తిరుపతయ్య కుటుంబ సభ్యులు అందజేసిన నిత్యావసర సరుకులను 20 విభిన్న ప్రతిభా వంతుల కుటుంబాలకు వారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ అధ్యక్షులు రఘునాథరెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సంయుక్త కార్యదర్శి సునీల్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల రూరల్ : పులివెందుల శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మాస్టర్ యువకిషోర్, యువరాజా డ్యాన్సింగ్ స్కూల్, పులివెందుల వారి శిష్య బృందంచే కోలాటం, జానపద, వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలు చేశారు. రఘుకుల తిలక రారా..(కోలాటం) పాటల నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రజలు, పరిపాలనా అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



కోలాటం వేస్తున్న మహిళలు



అశోక్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి - వేంపల్లె

గ్రామీణ ప్రాంతాల్లో వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గిడ్డంగివారిపల్లి, ఆశోక్‌నగర్ గ్రామాల్లో టిడిపి ఎన్నికల ప్రచారం నిర్వహించింది. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి టిడిపి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ సంక్షేమానికి మారుపేరు తెలుగుదేశం ప్రభుత్వానిదేనని తెలిపారు. వైసిపి పాలనలో ఇసుక మాఫియా, మద్యం మాఫియా, మట్టి మాఫియా అభివృద్ధి చెందాయన్నారు. ఎమ్మెల్యేగా మారెడ్డి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డికి, ఎంపిగా భూపేష్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్నాథరెడ్డి, రామగంగిరెడ్డి, మహమ్మద్ ఇనాయతుల్లా, జబిబుల్లా, జయచంద్రారెడ్డి, రెడ్డి కిషోర్, డివి సుబ్బారెడ్డి, తెలంగాణ వలి, వేమ కుమార్, డక్కా రమేష్, మడక శ్రీనివాసులు, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటాం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ముస్లిం మైనారిటీలకు అండగా ఉంటామని ఎన్‌డిఎ కడప పార్లమెంటు అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి ఆది నారాయణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం వారు ముస్లింలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమ్మలమడుగులో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదినారాయణరెడ్డి, కడప ఎంపీ అభ్యర్థిగా భూపేష్‌రెడ్డి అనే మేము బరిలో ఉన్నామని, తమకు ఈ సమయంలో అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో గోవర్ధన్‌రెడ్డి, ముస్లిం మైనారిటీ నాయకులు వెల్డింగ్ గైబు, కలాయిగిరి ఖదీర్, నజీర్, రఫీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌డిఎ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు

ఉన్నతాధికారుల పనితీరులో మార్పు రావాలి

ప్రజాశక్తి - చాపాడు

రాష్ట్రంలోని ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల పరిస్థితి చూస్తుంటే రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతాయా లేదా అనే భావన ప్రజల్లో కలుగుతోందని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి మునిశేఖర్‌రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారుల పరిస్థితి చూస్తుంటే అధ్వానంగా ఉందన్నారు. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకటించిన తర్వాత ప్రభుత్వ యంత్రాంగం అంతా ఎలక్షన్ కమిషన్ పరిధిలోకి వస్తుందన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం ఏ అధికారైన ఒక పార్టీకి కొమ్ము కాస్తే ఎలక్షన్ కమిషన్‌కు చర్యలు తీసుకొనే అధికారం ఉంటుందన్నారు. రాష్ట్రంలోని కొందరు ఉన్నతాధికారుల పనితీరు సరిగాలేదని ఎలక్షన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే విచారించి 9 మంది అధికారులను బదిలీ చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. ఎలక్షన్ కోడ్ అమల్లో ఉందని తెలిసి కూడా ప్రతిపక్షాల మీద ఎలక్షన్ కమిషనర్‌కు వినతిపత్రం ఇవ్వడం తప్పు అన్నారు. ఇకనైనా రాజ్యాంగం ప్రకారం రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలని ఆయన కోరారు.



కుక్కల దాడిలో చనిపోయిన గొర్రె పిల్లలు

కుక్కల దాడిలో 40 గొర్రె పిల్లలు మృతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కుక్కల దాడిలో 40 గొర్రెపిల్లలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సున్నపురాల పల్లెలో ఆదివారం చోటుచేసుకుంది. మేకల యజమాని తలారి సుబ్బరాయుడు వివరాల మేరకు.. తమ సొంత గ్రామం జమ్మలమడుగు మండలం దేవగుడి అన్నారు. గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. సున్నపురాళ్లపల్లె గ్రామంలో ప్రస్తుతం గొర్రెలదొడ్డిని ఏర్పాటు చేసి అక్కడ గొర్రెలను మేపుకుంటూ ఉన్నామన్నారు. ఆదివారం ఉదయం పిల్లలను దొడ్డిలోనే ఉంచి గొర్రెలను కొండకు మేత కోసం తీసుకు వెళ్లామన్నారు. మొత్తం 70 పిల్లలు ఉండగా అందులో 40పైన పిల్లలు కుక్కల దాడిలో చనిపోయాయని విలపించారు. వెంటనే సమాచారం పోలీసులకు, పంచాయితీ సెక్రెటరీకి తెలియజేశామన్నారు. తమ కుటుంబానికి ఇవే ఆధారమని, ప్రభుత్వం తమ కష్టాన్ని గుర్తించి ఆదుకోవాలని బాధితులు కోరారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రస్తుత వేసవి తాపం అధికంగా ఉందని, ఇలాంటి సమయంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ బద్వేలి శివప్రసాదరెడ్డి సూచించారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటి (సిర్డ్స్) ఆధ్వర్యంలో ఆదివారం బుడ్డాయపల్లిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఎండలో తిరగకూడదన్నారు. అత్యవసరంగా తిరగాల్సి వస్తే తలపై టోపీ, గొడుగు వంటివి వాడాలన్నారు. తలకు, శరీరానికి ఎండ తగలకుండా చూసుకోవాలన్నారు. రాగిజావ, టెంకాయనీళ్లు తీసుకోవాలన్నారు. అనంతరం పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిర్డ్స్ సొసైటీ సుబ్బారెడ్డి, ఆరోగ్య కార్యదర్శి రెబక, హాస్టల్ వెల్ఫేర్ అధికారి సత్యవతి, ఆరోగ్య కార్యకర్త డి.పెంచలయ్య పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది